సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 5 । మార్చి । 2023



గంజాయి అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ల ఆటకట్టు

గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తున్న అంతర్ రాష్ట్ర స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. 28 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. -8లో



ప్రాణం తీసిన ఈత సరదా

మైదుకూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ మహబూబ్ బాషా (13) ఈతకు వెళ్లి మృతి చెందాడు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.3 /16.6

వాతావరణం

జిల్లాలో శనివారం 16.6 - 35.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ మూర్తులు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామాగ్రి సమర్పించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులకు అభిషేకాలు చేసి, పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు.

రేపు అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసులు



పులివెందుల : తమిళనాడు తిరువణ్ణామలైలోని అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం వైఎస్సార్ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ వివిధ డిపోల నుంచి ఈనెల 6వ తేదీన ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన తెలుపుతూ జిల్లాలోని ఆరు డిపోల నుంచి తిరువణ్ణామలైలోని అరుణాచల గిరి ప్రదక్షణకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని.. కడప డిపో నుంచి ఒక్కొక్కరికి రూ.964లతో ఆర్టీసీ బస్సు బయలుదేరుతుందన్నారు. అలాగే పులివెందుల డిపో నుంచి ఒక్కొక్కరికి రూ.1112లతో వేముల, వేంపల్లె మీదుగా వెళుతుందన్నారు. బద్వేల్ డిపో నుంచి ఒక్కొక్కరికి రూ.1122లతో కడప మీదుగా వెళుతుందన్నారు. అలాగే మైదుకూరు డిపో నుంచి ఒక్కొక్కరికి రూ.1280లతో పోరుమామిళ్ల, కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా బయలుదేరుతుందన్నారు. అలాగే ప్రొద్దుటూరు డిపో నుంచి ఒక్కొక్కరికి రూ.1142లతో బయలుదేరుతుందన్నారు. జమ్మలమడుగు డిపో నుంచి ఒక్కొక్కరికి రూ.1298లతో ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప మీదుగా ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయన్నారు. మరిన్ని వివరాలకు ఆయా బస్టాండ్లలోని విచారణ కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

- ప్రభుత్వపరమైన వైఎస్ రాజారెడ్డి జూనియర్ కళాశాల
- కళాశాల విలీనం ప్రక్రియ పూర్తి
- కోట్లాది రూపాయల ఆస్తులు తృణప్రాయంగా సమర్పించిన వైనం
- నిరుపేద విద్యార్థులకు అండగా వైఎస్ కుటుంబ సభ్యులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగస్తులు, గ్రామీణులు



ఆశయంలో మేటి

దాతృత్వ దివిటీ



ప్రభుత్వంలో కళాశాల విలీన ప్రక్రియలో కరస్పాండెంట్ జనార్దన్‌రెడ్డి, అధికారులు

సాక్షి ప్రతినిధి, కడప/సింహాద్రిపురం : ప్రజలు పేదరికం నుంచి దూరం కావాలన్నా.. సామాజిక రుగ్మతల నుంచి బయటపడాలన్నా.. మెరుగైన జీవనానికి అడుగులు పడాలన్నా చదువుతోనే సాధ్యమని వైఎస్ఆర్ తలిచారు. ఆ ఆలోచనతోనే తండ్రి వైఎస్ రాజారెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ ట్రస్టు నెలకొల్పారు. ఆ ట్రస్టు తరపున 1981లో సింహాద్రిపురంలో వైఎస్ రాజారెడ్డి పేరిట జూనియర్ కళాశాల స్థాపించారు. సంకల్పబలంతో నెలకొలిపిన ఆ కళాశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న వేలాది మంది విద్యార్థులు వివిధ కొలువుల్లో స్థిరపడ్డారు. వారంతా విద్యా ప్రదాత.. వైఎస్ఆర్ అంటూ కొనియాడుతున్నారు. కాగా.. కోట్లాది రూపాయల కళాశాల ఆస్తులను, కళాశాలను ప్రభుత్వంలో విలీనం చేసి దాతృత్వంలో మేటిగా వైఎస్ కుటుంబం కీర్తి గడిస్తోంది.

సింహాద్రిపురం మండలం ఫ్యాక్షన్ ఊబిలో కూరుకుపోయిన కాలమది. పల్లెల్లో ముఠా తగాదాలు తిష్టవేసిన ఏరియా. ఆ సమయంలో సామాజిక మార్పు కోసం విద్యను అందుబాటులోకి తీసుకరావాలనే తలంపు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మదిలో మెదిలింది. వైఎస్ రాజారెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నేతృత్వంలో జూనియర్ కళాశాలను స్థాపించి, మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. ఆనాటి నుంచి నిస్వార్థంతో కళాశాల నిర్వహణ కొనసాగిస్తున్నారు. 1990 వరకూ వైఎస్ రాజారెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్టు కళాశాల నిర్వహణ చేపట్టగా, ఆ తర్వాత కళాశాల నిర్వహణను వైఎస్సార్ ఫౌండేషన్ కొనసాగించింది. 1990లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ అయినప్పటి నుంచి అన్ ఎయిడెడ్ సిబ్బందికి జీతాలు, కళాశాల నిర్వహణ కోసం వైఎస్సార్ ఫౌండేషన్ ద్వారా చైర్మన్ వైఎస్ భారతీరెడ్డి సుమారు కోటి రూపాయలు వెచ్చించారు. వెనుకబడిన ప్రాంతంలో చదువు అందుబాటులో ఉంచితే, గ్రామీణులు ఉన్నత లక్ష్యం అందుకుంటారనే ఆలోచన కార్యరూపమైంది. ఈకళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతో మంది ప్రభుత్వ కొలువుల్లో స్థిరపడ్డారు.

కోట్లాది రూపాయలు విలువైన ఆస్తులు ప్రభుత్వ పరం...

లాభాపేక్ష ధ్యేయంగా విద్య వ్యాపారమైన ప్రస్తుత నేపథ్యంలో.. సొంత ఆస్తులతో కలిపి ప్రభుత్వానికి ధారాదత్తం చేస్తూ పూర్వపు కరస్పాండెంట్ వైఎస్ భారతీరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పదెకరాల విస్తీర్ణంలో ఉన్న కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, రూ.3 కోట్లు విలువైన భవన సముదాయం, బహిరంగ మార్కెట్‌లో రూ.5 కోట్లు విలువైన స్థలంతో కలిపి ప్రభుత్వంలో విలీనం చేశారు. (నాలుగు పెద్ద భవనాలు, నాలుగు ల్యాబ్, రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు, ప్లేగ్రౌండ్, డైనింగ్ హాలు, మరుగుదొడ్లతోసహా కళాశాలలో అన్ని వసతులు కలిగి ఉన్నాయి). ప్రస్తుత కరస్పాండెంటు పి జనార్ధన్‌రెడ్డి ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ శేషగిరిబాబు, ఇంటర్మీడియట్ విద్యా సంచాలకులు విశ్వనాథనాయక్, ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యాధికారి శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐఓ రవినాయక్‌లచే ఇటీవల విలీన ప్రక్రియ పూర్తి చేశారు. కాగా, అక్కడ విధుల్లో ఉన్న కొందరు అధ్యాపకులు రెగ్యులర్ ఉద్యోగులయ్యారు. మిగిలిన అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది కాంట్రాక్టు ఉద్యోగులయ్యారు. ప్రభుత్వంలో విలీనం చేసేందుకు సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

కోట్ల విలువ చేసే భూమిని అప్పగించడం హర్షణీయం



1981లో ఇంటర్మీడియేట్ చదవాలంటే ఇక్కడి వారు పులివెందుల, తాడిపత్రికి వెళ్లాల్సి వచ్చేది. అప్పట్లో ఎక్సైజ్‌శాఖ మంత్రి హోదాలో ఉన్న వైఎస్ఆర్ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వైఎస్ రాజారెడ్డి జూనియర్ కళాశాలను సింహాద్రిపురంలో స్థాపించారు. 2004 నుంచి వైఎస్ భారతిరెడ్డి కళాశాల కరస్పాండెంట్‌గా శాశ్వత భవనాలు, ప్రహరీ గోడ, బోర్‌వెల్, మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భూమి ధర ఆకాశాన్ని అంటుతున్నా ప్రభుత్వంలో విలీనం చేసి దాతృత్వం చాటుకున్నారు. నూతన భవనాలు, పది ఎకరాల భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 20 కోట్లు ఉంటుంది.
– రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్, సింహాద్రిపురం

వైఎస్ భారతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు



సింహాద్రిపురం వైఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చడానికి కృషి చేసిన విద్యా ప్రదాత వైఎస్ భారతిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. విద్యతోనే మార్పు సాధ్యమని భావించి నాటి నుంచి నేటి వరకూ వైఎస్ కుటుంబం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. విద్యాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న వైఎస్ కుటుంబానికి ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు.
– బీఎస్ ఝాన్సీరాణి, జెడ్పీటీసీ, సింహాద్రిపురం

బాలకల పట్ల హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు
- హెచ్‌ఎంను సస్పెండ్ చేసిన అధికారులు



పిల్లల తల్లిదండ్రులను విచారిస్తున్న ఎంఈఓ త్యాగరాజు

తంబళ్లపల్లె : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మొగిలీశ్వరయ్య తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయమై పిల్లలు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. వారు శనివారం పాఠశాలకు వచ్చి హెచ్‌ఎంను మందలించి, తీరుమార్చుకోవాలని దేహశుద్ధి చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంఈవో త్యాగరాజు, సర్పంచ్ నీలూఫర్ పాఠశాల వద్దకు చేరుకున్నారు. తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించారు. హెచ్‌ఎం మొగిలీశ్వరయ్యను సస్పెండ్ చేస్తూ డీఈవో రాఘవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

21 కేజీల వెండి నగలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న వెండి నగలతో పోలీసులు

రాజంపేట : రాజంపేట-రాయచోటి మార్గంమధ్యలోని కూచివారిపల్లె వద్ద శుక్రవారం రాత్రి 21 కేజీల వెండి నగలు పట్టుకున్నారు. సీఐ నరసింహారావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. కలికిరి మండలానికి చెందిన రామచంద్రయ్య కారులో 21 కేజీల వెండి నగలు తీసుకొని వస్తుండగా పట్టుకున్నారు. వాటికి సంబంధించి సరైన పత్రాలు లేనందున పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. నగలను సంబంధిత అధికారులకు అందజేశారు. తనిఖీల్లో ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐలు రాజు, నరసింహులు, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్ పోటీలు

వైవీయూ రిజిస్ట్రార్
ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య



సెమీఫైనల్‌కు ఎంపికైన విద్యార్థులతో వైవీయూ రిజిస్ట్రార్, అధికారులు

వైవీయూ : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ కాంపిటీషన్ దోహదపడుతుందని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఏపీ ఉన్నత విద్యామండలి సహకారంతో వైవీయూలో నిర్వహించిన రాయలసీమస్థాయి క్విజ్ కాంపిటీషన్ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు తీసుకున్న ఉత్తమ నిర్ణయమన్నారు. క్వార్టర్ ఫైనల్‌లో విజేతలుగా నిలిచి విజయవాడలో నిర్వహించే సెమీఫైనల్, ఫైనల్‌కు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు మాట్లాడుతూ విద్యార్థిని పరిపూర్ణంగా తీర్చిదిద్దడమే విద్యాలయాల లక్ష్యమన్నారు. క్విజ్ కాంపిటీషన్ సమన్వయకర్త డాక్టర్ ఆర్.వి. జయంత్‌కశ్యప్ మాట్లాడుతూ ఈ కాంపిటీషన్‌లో 22 జట్లు పాల్గొనగా సెమీఫైనల్‌కు 4 జట్లు అర్హత సాధించాయన్నారు. ఏపీ ఉన్నతవిద్యామండలి ప్రతినిధి నగేష్ మాట్లాడుతూ ఏపీ ఉన్నతవిద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి మార్గదర్శనంలో ఈ క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్విజ్ మాస్టర్లుగా ఎం. మనోజ్‌కుమార్, డా. టి. సురేష్‌బాబు, డా. జి. శివశంకర్ వ్యవహరించారు.

సెమీఫైనల్‌కు ఎంపికైన జట్లు

- ఎల్.వంశీకృష్ణ, జి.టి. దినేశ్వర్ (జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కర్నూలు)
- హెచ్.వెంకటేశ్వర వర్మ, వి. దుర్గాప్రసాద్ (సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పుత్తూరు)
- కె.శివజయంత్‌రెడ్డి, ఎన్. చక్రధర్ (శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి)
- కె.సాయిచరణ్, బి. ఇందుశ్రీ (గేట్ డిగ్రీ, పీజీ కళాశాల, తిరుపతి).

పుష్పగిరి కొండల్లో తవ్వకాలపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

ఖాజీపేట : గుప్తనిధుల కోసం పుష్పగిరి కొండల్లో తవ్వకాలు జరిపిన ఘటనపై కేసు నమోదైంది. పుష్పగిరి కొండపై గుప్త నిధుల కోసం తవ్వకాలు అనే కథనం 'సాక్షి'లో శనివారం ప్రచురితమైంది. దీనిపై అధికార యంత్రాంగం స్పందించింది. ఖాజీపేట తహసీల్దార్ రమణారెడ్డి, రెవెన్యూ అధికారులు శనివారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కొండపై సుమారు 25 అడుగుల లోతు గుంతను గుర్తించారు.

పోలీసులకు ఫిర్యాదు

తహసీల్దార్ రమణారెడ్డి మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. తవ్వకాలకు కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన తెలిపారు. కొండపై ఇలాంటి తవ్వకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఐ కేసు నమోదు చేశారు. శుక్రవారం సంఘటన స్థలంలో దొరికిన బైక్‌ల ఆధారంగా తవ్వకాలకు కారకులైన వారిని పట్టుకుని, విచారణ చేస్తామని ఆయన తెలిపారు.

తవ్వకాలకు కారకులెవరు?

పుష్పగిరి కొండపై ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన పోలీస్ రిసీవర్ స్టేషన్ ఉంది. అయినా అక్కడ జనరేటర్లు, లోపలి వేడి బయటకు రావడానికి ఫ్యాన్లు ఉపయోగించి తవ్వకాలు జరపడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇంత తతంగం జరిగినా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించక పోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చర్యలు తీసుకోవాలి

కడప కల్చరల్ : గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కడప నగరానికి చెందిన ఇంటాక్ జీవిత కాల సభ్యుడు, శ్రీ జగన్మాత మారెమ్మ తల్లి ఆలయ ధర్మకర్త, శ్రీ పుష్పగిరి క్షేత్ర ధర్మ పరిరక్షణ సేవా సమితి ప్రతినిధులు కోరారు.

కడపలో ఆర్టికస్ గ్లోబల్ ఐటీ పార్క్

- గ్లోబల్ సమ్మిట్‌తో మెరవనున్న ఈఎంసీ
- రూ.1500 కోట్ల పెట్టుబడులు... 21 పరిశ్రమలు
- 54వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ ఉపాధి
- గండికోటలో ఒబెరాయ్ సంస్థ 7 స్టార్ హోటల్, విల్లాస్ నిర్మాణం
- టూరిజం విశేషాభివృద్ధి దిశగా అడుగులు



సంస్థ నెలకొల్పేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఆర్టికస్ గ్లోబల్ ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, కడప : గ్లోబల్ సమ్మిట్‌తో కడప పరిశ్రమలతో మెరిసిపోనుంది. తొలి ఐటీ పార్క్ కడప గడపలో రూపుదిద్దుకోనుంది. జర్మనీ, అమెరికా, హైదరాబాద్‌లో కొలువై ఉన్న ఆర్టికస్ గ్లోబల్ ఐటీ సంస్థ ఏడాది లోపు జిల్లాలో కార్యకలాపాలు కొనసాగించనుంది. 21 పరిశ్రమలు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో నెలకొల్పేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నాయి. తద్వారా 54వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

ఉక్కు నగరం విశాఖపట్నంలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. సొంత గడ్డపై ఐటీ పార్క్ ఏర్పాటు చేయాలనే కృతనిశ్చయంతో ఆర్టికస్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్యామసుందర్ రెడ్డి, సీఈఓ సికే రెడ్డిలు ముందడుగు వేశారు. మూడేళ్ల కాలపరిమితిలో రూ.100 కోట్లు వెచ్చించి 500 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించాలనే దిశగా ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా 2024 ఫిబ్రవరి నుంచి జిల్లాలో కార్యకలాపాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇదిలా ఉండగా.. జిల్లాలోని కొప్పర్తి ఈఎంసీలో మరో 21 పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు.

గండికోటపై మక్కువ....


రాష్ట్రంలో టూరిజం డెవలప్‌మెంట్‌కు చేసుకున్న ఒప్పందాల్లో గండికోట ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ గ్రూప్స్ అధినేత ముఖేష్ అంబాని మాటల్లో గండికోట ప్రస్తావన వచ్చింది. పర్యాటకాభివృద్ధికి తాము చేపట్టనున్న అంశాల గురించి సూచనప్రాయంగా తెలిపారు. పర్యాటకానికి అతి ముఖ్యమైన ఆతిథ్య రంగంపై దృష్టి సారిస్తున్నామన్నారు. తమ మాతృ సంస్థ లక్ష్మి హోటల్స్ పేరుతో ఒబెరాయ్ గ్రూప్స్ ఆధ్వర్యంలో గండికోటలో సెవెన్‌స్టార్ హోటల్‌తోపాటు విల్లాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అన్నమయ్య జిల్లాలో హార్సిలీ హిల్స్‌లో కూడా అభివృద్ధికి కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు.

సొంత గడ్డపై మమకారంతోనే...



సొంత గడ్డపై ఉన్న మమకారంతో ఇంటిగ్రేటెడ్ ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధమయ్యాం. కడపలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఒప్పందం చేసుకున్నాం. మూడేళ్ల కాలంలో రూ.100 కోట్లు వెచ్చించి, 500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించనున్నాం.
– శ్యామసుందర్‌రెడ్డి, ఆర్టికస్ గ్లోబల్ సీఓఓ.

సమ్మిట్‌లో మెరిసిన ఈఎంసీ



గ్లోబల్ సమ్మిట్‌లో కడప ఈఎంసీలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారు. 21 పరిశ్రమలు నెలకొల్పేందుకు ఎంఓయూలు చేసుకున్నారు. ఈ పరిశ్రమల ద్వారా రూ.1500 కోట్లు పెట్టుబడులు ఈఎంసీలోకి రానున్నాయి. దాదాపు 54వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.
– ఎం.గౌతమీ, కొప్పర్తి ఈఎంసీ సీఈఓ.

క్లుప్తంగా

మోటార్ల వైర్లు దగ్ధం

• తాటి చెట్లకు వ్యాపించిన మంటలు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని గొరిగెనూరు, ధర్మాపురం గ్రామ పొలాల్లో ఉన్న పెన్నానదిలో నీటి కోసం రైతులు వేసుకున్న మోటార్ల వైర్లు దగ్ధమయ్యాయి. శనివారం సాయంత్రం గుర్తు తెలియని దుండగులు సిగరేట్ తాగి వేయడంతో పెన్నా నదిలో ఉన్న సుమారు 30 మోటార్లకు సంబంధించిన వైర్లు కాలిపోయాయి. అంతే కాకుండా గ్రామ పొలాల్లో తాటి చెట్లకు మంటలు వ్యాపించి దాదాపు 200 తాటి చెట్లు దగ్ధమయ్యాయని రైతులు వాపోయారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వాహనం వచ్చే లోపల మోటార్ల వైర్లు పూర్తిగా కాలిపోయాయి. అనంతరం మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

కడపలో సోము వీర్రాజు ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న నగరూరు రాఘవేంద్రకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కడపలో ప్రచారం నిర్వహించారు. శనివారం నగరంలోని మున్సిపల్ మైదానంతో పాటు నెహ్రూ పార్కులో ఆయన పట్టభద్రులను కలుసుకుని ప్రచారం చేశారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి గాను ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నగరూరు రాఘవేంద్రకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్‌రావు, చలపతి, బాలకృష్ణ యాదవ్, మునగా సతీష్, కల్యాణ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ల ఆటకట్టు

- నాలుగు ప్రాంతాల్లో దాడులు
- మూడు ముఠాలకు చెందిన 18 మందితోపాటు మరొకరి అరెస్ట్
- 28 కిలోల గంజాయి, కారు, మూడు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్ స్వాధీనం
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

కడప అర్బన్ : గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తున్న అంతర్ రాష్ట్ర స్మగ్లర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పోలీసు సిబ్బంది, ఎస్ఈబీ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. మైదుకూరు, కమలాపురం, కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిల్లో దాడులు నిర్వహించి, 18 మందిని అరెస్ట్ చేశారు. సిద్దవటంలో ఎస్ఈబీ వారి ఆధ్వర్యంలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 19 మందిని కటకటాల వెనక్కి పంపించారు. వారి వద్ద నుంచి 28 కిలోల గంజాయి, కారు, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ స్మగ్లర్లు ప్రధానంగా జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తున్నారు. కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జోరుగా సాగుతున్నాయని భావించి పోలీసులు నిఘా పెంచారు. కమలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్ రాష్ట్ర స్మగ్లర్లు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఎస్.కిరణ్‌కుమార్, జె.సందీప్, ప్రధాన రవాణా దారుడు కమలాపురం రామనగర్‌కు చెందిన పూజారి సాయి, అతని అనుచరుడు ఇందిరమ్మ కాలనీ నివాసి మునగా శివకుమార్, పైడిమాను కాలనీకి చెందిన స్థానిక విక్రయదారుడు, రవాణాదారుడు సోమేసుల వెంకట లక్షుమ్మ ముఠాగా ఏర్పడి గంజాయి కార్యకలాపాలు కొనసాగించారు. వారిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు.

■ కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలపల్లి మండలం వంగసారి నివాసి కొర్రా మత్స్యరాజు, అంతర్ జిల్లా గంజాయి అక్రమ రవాణా దారుడు నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన నట్వ చంద్ర శ్రీకాంత్, అతని అనుచరుడు కడప సాయిపేట నివాసి షేక్ అల్లాబకాష్, అతని స్నేహితుడు, కడప నగరం ప్రకాష్ నగర్‌కు చెందిన సాకే శంకర్, శ్రీకాంత్ స్నేహితుడైన మైదుకూరు మండలం గొల్లపల్లి నివాసి మధం సుష్మంత్ అనే ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

■ మైదుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో స్థానిక ప్రధాన గంజాయి స్మగ్లర్ మైదుకూరు టౌన్ విజయనగర్ కాలనీకి చెందిన భూమిరెడ్డి చిన్న చెన్నయ్యగారి పుల్లయ్య, అంతర్ జిల్లా గంజాయి స్మగ్లర్, 15 కేసుల్లో నిందితుడిగా వున్న మైదుకూరు మండలం కేశలింగాయపల్లికి చెందిన పసల వినోద్‌కుమార్‌తో పాటు స్థానికంగా విక్రయించే పెద్దక్క, పుల్లయ్యకు అనుచరుడైన మైదుకూరు టౌన్ శాంతినగర్‌కు చెందిన సయ్యద్ ఖాదర్ వల్లీ, బద్వేల్‌కు చెందిన స్థానిక గంజాయి విక్రయదారులు రాంబాబు, తిరుపతయ్య, మైదుకూరు టౌన్‌కు చెందిన రమేష్, ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన మస్తానమ్మ అలియాస్ గౌసియా అనే 8 మందిని అరెస్ట్ చేశారు. అలాగే సిద్దవటంలో ఎస్ఈబి వారి ఆధ్వర్యంలో స్థానిక గంజాయి విక్రయదారుడు కొండయ్యను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 19 మందిని అరెస్ట్ చేశారు. శనివారం తెల్లవారుజామున ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పోలీసు అధికారులు, సిబ్బంది వీరిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయిని ఎవరైనా విక్రయించినా, కొనుగోలు చేసినా, సరఫరా చేసినా, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదే పదే ఇలాంటి నేరాలకు పాల్పడితే పి.డి యాక్ట్‌లను ప్రయోగిస్తామని హెచ్చరించారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ పూజిత నీలం, కడప ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ బి.నాగభూషణ్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాజా ప్రభాకర్, కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, మైదుకూరు సీఐ చలపతి, కమలాపురం సీఐ పి. సత్యబాబు, సిద్దవటం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఉరుకుందమ్మ, ఎస్ఐలు చిన్నపెద్దయ్య, మధుసూధన్‌రెడ్డి, పెద్ద ఓబన్న, గణమద్దిలేటి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుళ్లు శ్యామ్ సుందర్, మురళీమోహన్, రామకృష్ణతోపాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

గంజాయి సమాచారం ఇవ్వండి : ఎస్పీ

గంజాయి విక్రయాలు, వినియోగించే వారి సమాచారాన్ని ప్రజలు డయల్ 100కు గానీ, 94407 96900కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కోరారు. వైజాగ్ నుంచి రైళ్లు, కార్లలో రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం తాము గుర్తించిన గంజాయిని వినియోగిస్తున్న 30 మందికి కడప రిమ్స్‌లో రిహాబిలిటేషన్ కేంద్రం ద్వారా కౌన్సెలింగ్‌ను ఇప్పిస్తామని పేర్కొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 115 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు శనివారం చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 115 కేసులను నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలను నడిపిన వారిపై 103 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహనాల డ్రైవర్లపై 12 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు.

స్కూటర్ ఢీకొని వృద్ధుడి మృతి

చాపాడు : పల్లవోలు గ్రామం వద్ద శనివారం రాత్రి స్కూటర్ ఢీకొని దోనాది రమణయ్య (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. పల్లవోలు గ్రామం వద్ద మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై దోనాది రమణయ్య రోడ్డు దాటుతుండగా మైదుకూరు వైపు నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ నడుపుతున్న జతిన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో జతిన్‌ను ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలోని గడ్డంవారిపల్లె వద్ద మైదుకూరు – బద్వేలు రహదారిపై శనివారం రెండు మోటారు బైక్‌లు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. గడ్డంవారిపల్లె నుంచి మస్తాన్, దస్తగిరి, బద్వేలు వైపు నుంచి రవికుమార్, సుదీప్త బైక్‌లపై వస్తున్నారు. గడ్డంవారిపల్లె క్రాస్ వద్ద ఈ రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. సంఘటనలో రవికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్య



మృతి చెందిన వెంకటశ్వేత

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని బొల్లవరంలో నివాసం ఉంటున్న వెంకటశ్వేత (24) అనే యువతి శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. వెంకటశ్వేత బీటెక్ పూర్తి చేసి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోంలో భాగంగా ఇంటి నుంచే విధులు నిర్వహిస్తోంది. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి పని ఒత్తిడి ఎక్కువగా ఉందని తల్లిదండ్రులకు చెబుతూ బాధపడేది. ఉద్యోగం మానేస్తే స్నేహితుల మధ్య బాగుండదని భావించి పని చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో బాత్రూంలోకి వెళ్లిన ఆమె చాలా సేపయినా బయటికి రాలేదు. తల్లిదండ్రులు ఎంత పిలిచినా శ్వేత పలకలేదు. దీంతో తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లగా ఆమె ఉరికి వేలాడుతోంది. వెంటనే యువతిని కిందికి దించి ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపాడు. తండ్రి సహదేవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

రేపు ఈశ్వరీదేవిమఠంలో వేలం

బ్రహ్మంగారిమఠం : జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తునట్లు ఈఓ బీవీ జగన్ మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి దగ్గర కొబ్బరి ముక్కల వసూలు, తలనీలాలు, పాత ధ్వజస్తంభానికి అమర్చిన ఇత్తడిరేకు, గంటలు, అమ్మవారి చీరెలు, మరుగు దొడ్ల నిర్వహణ వంటి వాటికి వేలం వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హెచ్చుపాటదారులకు 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 3 వరకు అనుమతులు ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ : 9849617179కు సంప్రదించాలని వివరించారు.

తబ్లిగి దీని ఇస్తెమా ప్రారంభం



ఆధ్యాత్మిక సమ్మేళనంలో పాల్గొన్న ముస్లింలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి తబ్లిగి దీని ఇస్తెమా ఆధ్యాత్మిక సమ్మేళనం ప్రారంభమైంది. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ముస్లిం ప్రముఖులు పాల్గొని అల్లా గొప్పతనం, దైవ సందేశం, శాంతియుత జీవనంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం వరకు కొనసాగనుంది.

మాది న్యాయమైన పోరాటం

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తాము చేస్తున్నది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదని, హక్కుల కోసం చేస్తున్న న్యాయమైన పోరాటమని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. కడప నగరం మద్రాసురోడ్డులోని వైఎస్సార్ ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంలో కుటుంబ సభ్యులుగా ఉంటున్న ఉద్యోగులు సంతోషంగా ఉంటేనే సంక్షేమ పథకాలను అమలు చేస్తారని పేర్కొన్నారు. తమ వెనుక ఏ శక్తులు ఉండి నడిపించడం లేదని, ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేసేందుకే ఈ ఉద్యమం చేపడుతున్నామన్నారు. ఈ నెల 9 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు తాము చేపట్టే నిరసనలకు అధికారులు సహకరించాలని కోరామన్నారు. సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు, రాష్ట్ర నాయకులు సాంబశివరావు, మల్లేశ్వరరావు, వైఎస్సార్ జిల్లా చైర్మన్ జీవన్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కోశాధికారి రొనాల్డ్ శ్యాముల్‌రాజ్, సెక్రటరీ అలీఖాన్, నరసయ్య, రాజశేఖర్, రామమూర్తితో పాటు అన్ని సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు కోరారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా వారు శనివారం కడప కలెక్టరేట్‌లో పర్యటించి పలుశాఖల అధికారులు, ఉద్యోగులను కలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజును కలిసి ఉద్యమ కార్యాచరణ వివరించి వివిధ శాఖల్లో కరపత్రాలు పంపిణీ చేశారు.

జిల్లా వైస్ చైర్మన్‌గా పురుషోత్తం

ఏపీ జేఏసీ అమరావతి జిల్లా వైస్ చైర్మన్‌గా ఏపీ పీటీడీ ఉద్యోగి ఎం.పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలోకి ఆయనను తీసుకున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్



డబ్బును సీఐకు అందజేస్తున్న గౌస్‌లాజం

ప్రొద్దుటూరు క్రైం : ఆటో డ్రైవర్ గౌస్‌లాజం నిజాయితీని చాటుకున్నాడు. తన ఆటోలో ఒక ప్రయాణికుడు మరచిపోయిన రూ.85,000 డబ్బున్న బ్యాగును పోలీసులకు అప్పగించాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. బద్వేలులోని గూడెంకు చెందిన ఉరివిండి గోవిందరెడ్డి శనివారం తన కుమారుడ్ని కలవడానికి బస్సులో ప్రొద్దుటూరు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండులో దిగిన అతను గాంధీరోడ్డుకు వెళ్లేందుకు అక్కడే ఉన్న గౌస్‌లాజం ఆటో ఎక్కాడు. గోవిందరెడ్డి ఆటో దిగి వెళ్లేటప్పుడు వెంట తెచ్చుకున్న బ్యాగును మరచిపోయాడు. తర్వాత గౌస్‌లాజం తన ఆటోలో బ్యాగు ఉన్న విషయం తెలుసుకొని నేరుగా టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ ఇబ్రహీంకు అందజేశాడు. తన ఆటోలో ఎక్కిన వ్యక్తి బ్యాగు మరచిపోయి వెళ్లాడని.. అందులో డబ్బుతోపాటు బట్టలు ఉన్నాయని గౌస్‌లాజం సీఐకి వివరించాడు. విచారణలో భాగంగా గోవిందరెడ్డిని స్టేషన్‌కు పిలిపించి సీఐ డబ్బు అందజేశారు. ఆటో డ్రైవర్ గౌస్‌లాజం నిజాయితీని మెచ్చిన సీఐ ఇబ్రహీం రూ.2000 అందజేసి, అభినందించారు.

కేవీకే సేవలను మరింత చేరువ చేయాలి

కడప అగ్రికల్చర్ : కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేవలను రైతులకు మరింత చేరువ చేయాలని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్ర సహ సంచాలకులు డాక్టర్ రమణ తెలిపారు. శనివారం కేవీకేలో శాస్త్రయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు నాణ్యమైన పరిశోధలను చేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విస్తరణాంశాలను తమ కార్యచరణలో రూపొందించుకోవాలని తెలిపారు. ఐసీఏఆర్ అటారి జోన్ 10 ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏఆర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది కాబట్టి, చిరుధాన్యాలపై క్షేత్ర పరిశీలనకు ప్రథమ శ్రేణి కార్యాచరణ ఇవ్వాలన్నారు. అలాగే డ్రోన్‌ల ద్వారా పురుగుల నివారణ మందుల పిచికారిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అనుసంధానం చేసి పటిష్ట పరచాలన్నారు. గుంటూరు విస్తరణ సంచాలకుల కార్యాలయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విశాలక్ష్మి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాలలో ఏదైనా సాంకేతిక లోపాలు ఉంటే నివారించుకోవడానికి శాస్త్రవేత్తలకు తెలియచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతోపాటు కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, మహేష్‌బాబు, లావణ్య, ప్రశాంత్, సాయి మహేశ్వరి, స్వామి చైతన్య, మానస, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు ప్రత్యూషా, రామలక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

నీటి గుంటలో దూకి బాలుడి మృతి



మృతి చెందిన మహబూబ్ బాషా

మైదుకూరు : ఈత సరదా ఓ బాలుడి ప్రాణం తీసింది. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. మైదుకూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ మహబూబ్ బాషా (13) శనివారం కాలనీ సమీపంలోని ఉప్పొంక నీటి గుంటలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. కాలనీకి చెందిన ఖాదర్ బాషా, ఖాదర్ బీలకు ముగ్గురు పిల్లలు. పెద్దకుమారుడు కూలి పనులకు వెళుతుండగా కుమార్తెకు వివాహం అయింది. చిన్న కుమారుడు మహబూబ్ బాషా చాపాడు మండలం ఆనందాశ్రమం పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం తల్లిదండ్రులు కూలి పనులకు వెళుతూ.. పాఠశాలకు వెళ్లాలని కుమారుడికి చెప్పారు. మహబూబ్ బాషా పాఠశాలకు వెళ్లకుండా కాలనీకి చెందిన తోటి పిల్లలతో కలిసి సమీపంలోని ఉప్పొంక వద్దకు వెళ్లాడు. మొత్తం నలుగురు పిల్లలు వంకపై చెక్ డ్యాం కట్టిన చోట ఉన్న నీటి గుంటలో ఈత కొట్టేందుకు దూకారు. ముగ్గురు బయటకు రాగా మహబూబ్ బాషా తల గుంటలోని బురదలో కూరుకుపోవడంతో బయటకు రాలేకపోయాడు. మిగిలిన ముగ్గురు భయపడిపోయి ఇళ్లకు వెళ్లి విషయం చెప్పారు. కాలనీకి చెందిన కొందరు గుంటలో కూరుకుపోయిన బాలున్ని బయటకు తీసి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యుడు నిర్ధారించాడు. తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

స్పెల్ ‘బి’ కాంపిటీషన్‌లో ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక





ఈశ్వరీ యాదవ్ సాయిలక్ష్మి రీతుశ్రీ

వైవీయూ : సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ కాంపిటీషన్‌లో జిల్లా విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. జనవరిలో తిరుపతిలో నిర్వహించిన రాయలసీమ ప్రాంతీయ స్థాయి స్పెల్ ‘బి’ కాంపిటీషన్‌లో జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడప చిన్నచౌకులోని జీఆర్‌టీ జీవీకే ఇంగ్లిషు మీడియం పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపిక కావడం విశేషం. స్పెల్ బి కాంపిటీషన్‌లో సాయిలక్ష్మి (3వ తరగతి), ఈశ్వరీ యాదవ్ (4వ తరగతి), రీతుశ్రీ (10వ తరగతి)లు వేర్వేరు కేటగిరీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న స్టేట్ లెవల్ స్పెల్ ‘బి’ కాంపిటీషన్‌లో పాల్గొననున్నారు. పాఠశాల విద్యార్థుల ప్రతిభ పట్ల జీఆర్‌టీ జీవీకే విద్యాసంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.శంకర్ హర్షం వ్యక్తం చేశారు.

మ్యాథ్స్ ‘బి’లో ఏడుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక






ఎస్. తేజస్విని చక్రితానాయుడు చత్రపతిరెడ్డి వేదచరణ్

కడప నగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి మ్యాథ్స్ ‘బి’ కాంపిటీషన్‌లో నగరంలోని జీఎంఆర్ ఇంగ్లిషు మీడియం పాఠశాల నుంచి ఆరుగురు, నాగార్జున మోడల్ స్కూల్ నుంచి ఒకరు ఎంపికయ్యారు. జీఎంఆర్ పాఠశాల నుంచి ఎస్.తేజస్విని(4వ కేటగిరీ), కె.సి.చిన్నకేశవరెడ్డి (4వ కేటగిరీ), కె.సి.చత్రపతి రెడ్డి (3వ కేటగిరీ), పి.చక్రితానాయుడు (2వ కేటగిరీ), బి.కృష్ణ ఆదిత్య, జి.నరసింహ (1వ కేటగిరీ)లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను కరస్పాండెంట్ జి. మధుసూధన్‌రెడ్డి అభినందించారు. వీరితోపాటు నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి వేదచరణ్ (4వ కేటగిరీ)లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థిని నాగార్జున పాఠశాల యాజమాన్యం అభినందించింది.